క్లుప్తంగా

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను సరిచేయాలి



మాట్లాడుతున్న ఆర్‌డీఓ, ఎన్నికల నమోదు అధికారి హరిప్రసాద్

కర్నూలు కల్చరల్: డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను సక్రమంగా పరిశీలించాలని ఆర్‌డీఓ, ఎన్నికల నమోదు అధికారి హరిప్రసాద్ బూత్ లెవెల్ అధికారులను ఆదేశించారు. కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలపై బూత్ లెవల్ అధికారులతో గురువారం కర్నూలు ఎంపీపీ హాల్‌లో సమీక్ష నిర్వహించారు. ఎస్ఎస్ఆర్–2024లో భాగంగా ప్రచురితమైన ముసాయిదా ఓటర్ల జాబితాలను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో స్పెషల్ కాంపెయిన్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు, ఉప తహసీల్దార్ భాను, ఎన్నికల ఉప తహసీల్దార్ ప్రవీణ్, ఏఎస్ఓ శివన్న పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శివాజీరావు

కర్నూలు (లీగల్): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రసూన న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ శివాజీరావు సూచించారు. గురువారం కళాశాలలో మాదక ద్రవ్యాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, గంజాయి, కొకైన్ తదితర మాదక ద్రవ్యాలు పండించినా, రవాణా చేసినా, వ్యాపారం చేసినా చట్టపరంగా శిక్షార్హులు అన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్యానల్ న్యాయవాది శివసుదర్శన్ మాట్లాడుతూ మొదట్లో సరదాగా తీసుకున్నా తర్వాత వ్యసనంగా మారి ప్రాణాలమీదకు తెస్తుందన్నారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కళాశాల డీన్ ప్రొఫెసర్ డాక్టర్ జె.వి.శివకుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపిక



ఎంపికైన ప్రదర్శనతో విద్యార్థి కౌసిక్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): గుంటూరులో జరుగుతున్న రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌లో అథెనా పాఠశాల విద్యార్థి కౌసిక్ రెడ్డి ప్రదర్శన జాతీయ స్థాయికి ఎంపికైంది. జిల్లా నుంచి ఏడు ప్రదర్శనలను ఉంచగా తక్కువ ఖర్చుతో వికలాంగుల కోసం తయారు చేసిన మ్యూజికల్ వీల్ చైర్ జాతీయస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపికైంది. జిల్లా విద్యార్థి ప్రదర్శన జాతీయస్థాయికి ఎంపికకావడంపై డీఈఓ రంగారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

నిజమైన రైతులకు రైతుబజారులో స్థానం

కర్నూలు(అగ్రికల్చర్): సి.క్యాంపు రైతు బజారులో నిజమైన రైతులకు కూరగాయల విక్రయించుకునేందుకు స్థానం కల్పిస్తామని హార్టికల్చర్ కన్సల్టెంట్ శివకుమార్ తెలిపారు. వెల్దుర్తి, బేతంచెర్ల మండలాల్లోని కలుగొట్ల, ఎంబాయి, రుద్రవరం గ్రామాల రైతులు సీ.క్యాంపు రైతుబజారులో తాము పండించిన కూరగాయలను అమ్ముకునేందుకు అనుమతి ఇవ్వాలని పలువురు రైతులు ఇటీవల జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యకు దరఖాస్తు చేసుకున్నారు. జేసీ ఆదేశాల మేరకు ఎస్టేట్ అధికారి హరీష్‌కుమార్ గురువారం క్షేత్రస్థాయికి వెళ్లి ఉద్యాన పంటల సాగును పరిశీలించారు.

క్యాంపులను వినియోగించుకోండి

కర్నూలు (టౌన్): ఓటు ఉందో లేదో తెలుసుకునేందుకు డిసెంబర్ 2, 3 తేదీల్లో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక క్యాంపులను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి భార్గవ్‌తేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో బూత్ లెవల్ ఆఫీసర్ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని, ఓటు లేని వారు సంబంధిత ఫారాలు పూర్తి చేసి అందజేయాలని సూచించారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు పూర్తయిన యువతీ, యువకులు ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

ఆదోని అర్బన్ : మండల పరిధిలోని బసాపురం గ్రామం వద్ద గురువారం రాత్రి ఆటో బోల్తా పడటంతో జాలుమంచి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ సిద్దయ్య మృతిచెందాడు. అతను జాలుమంచి నుంచి బసాపురం వెళ్తుండగా గ్రామ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రుడిని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

నిశ్శబ్ద విప్లవం





ఎయిడ్స్ అంటే ఒకప్పుడు చచ్చేంత భయం. సదరు రోగి ఫలానా చోట ఉన్నాడంటే అటువైపు వెళ్లేందుకు సైతం సాహసించేవారు కాదు. ఇప్పుడు సాధారణ ప్రజల్లా వారు కలిసిమెలసి తిరుగుతున్నారు. దీనికి కారణం ఈ వ్యాధి పై ప్రజలకు అవగాహన రావడమే. ఎయిడ్స్ అంటుకునే వ్యాధి కాదు అంటించుకునే వ్యాధి అని తెలుసుకుని దాని భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకు ప్రభుత్వం, జిల్లా అధికారులు సైతం అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నారు. ఫలితంగా జిల్లాలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బాధితుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- జిల్లాలో తగ్గుతున్న ఎయిడ్స్ ప్రభావం
- ఐదేళ్ల క్రితంతో పోలిస్తే తగ్గుదల
- ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే కారణం
- నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఐసీటీసీ, పీపీసీటీసీతో పాటు ఆదోని ఏరియా ఆసుపత్రి, ఆదోని ఎంసీహెచ్ ఆసుపత్రి, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరులలో ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్స్(ఐసీటీసీ) కేంద్రాలున్నాయి. మొత్తంగా 35 పీహెచ్‌సీలు, మూడు సీహెచ్‌సీలు, 28 యూపీహెచ్‌సీలు, పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ సెంటర్లు ఆరు, కమ్యూనిటీ బేస్డ్ టెస్టింగ్ సెంటర్లు ఆరు, సివిల్ డిస్పెన్సరీ అండ్ రీజినల్ ఐ హాస్పిటల్స్ రెండు, మొత్తం ఐసీటీసీలు 87 ఉన్నాయి. వీటితో పాటు యాంటి రిట్రీవల్ థెరపీ సెంటర్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, ఆదోని ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు.



ఐసీటీసీ కేంద్రంలో హెచ్‌ఐవీ బాధితునికి కౌన్సిలింగ్ ఇస్తున్న సిబ్బంది

సురక్ష క్లినిక్స్ మూడున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 7,168 మంది హెచ్‌ఐవీతో బాధితులున్నారు.

అవగాహనతో తగ్గుతున్న హెచ్‌ఐవీ బాధితులు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ విభాగం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల వల్ల హెచ్‌ఐవీ బాధితుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. 2018లో సాధారణ ప్రజలు 78,484 మందికి పరీక్షలు చేయగా 1,249 మందికి హెచ్‌ఐవీ నిర్ధారణ కాగా ప్రస్తుత యేడాది అక్టోబర్ వరకు 46,752 మందికి పరీక్షలు చేయగా 295 మందికి హెచ్‌ఐవీ నిర్ధారణ అయ్యింది. అలాగే గర్భిణుల్లో 2018లో 62,498 మందికి పరీక్షలు చేయగా 67 మందికి పాజిటివ్ రాగా, ఈ యేడాది అక్టోబర్ వరకు 48,071 మందికి పరీక్షలు చేయగా కేవలం 11 మందికి మాత్రమే హెచ్‌ఐవీ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది.

వీరి ద్వారా హెచ్‌ఐవీ విస్తరణ

ఫిమేల్ సెక్స్‌వర్కర్స్ 6,757 మంది, ఎంఎస్ఎంలు(స్వలింగసంపర్కులు) 2,302లు, లింగమార్పిడి చేయించుకున్న వారు 292ల ద్వారా హెచ్‌ఐవీ వ్యాపిస్తుందని భావించి వారికి అవసరమైన వైద్యసేవలను ఎన్‌జీఓలు అందిస్తున్నాయి. వీరితో పాటు లింక్ వర్కర్ స్కీమ్ ప్రోగ్రామ్ ద్వారా వలసలు వచ్చిన వారు, ట్రక్కు డ్రైవర్లు ఇతరుల ద్వారా హెచ్‌ఐవీ వ్యాప్తి చెందకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాకు మూడు రాష్ట్రస్థాయి అవార్డులు

ఉత్తమ సేవలు అందించిన విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఏటా డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అందజేసే రాష్ట్రస్థాయి అవార్డులు జిల్లాకు మూడు లభించాయి. ఉత్తమ జిల్లా అవార్డు, ఉత్తమ ఐసీటీసీ(ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కర్నూలు), ఉత్తమ స్టేట్ రిఫరెన్స్ లేబోరేటరీ(మైక్రోబయాలజీ విభాగం, కర్నూలు మెడికల్ కాలేజీ).

అవగాహన కార్యక్రమాలు

- జానపద నృత్యకళాకారుల బృందాలచే హైరిస్క్ ప్రాంతాల్లో ఆటపాటల ద్వారా అవగాహన కార్యక్రమాలు
- కళాశాలల్లో రెడ్‌రిబ్బన్ క్లబ్‌ల ద్వారా సుఖవ్యాధులు, హెచ్‌ఐవీ, టీబీ, కౌమార దశలోని మార్పుల గురించి అవగాహన కార్యక్రమాలు
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు మరింత పోషకాహారం పంపిణీ
- డీఆర్‌డీఏ ద్వారా హెచ్‌ఐవీ బాధితులకు పెన్షన్ల పంపిణీ
- సివిల్ సప్లయ్స్ ద్వారా సెక్స్‌వర్కర్లు, స్వలింగసంపర్కులు, లింగమార్పిడి చేయించుకున్న వారికి రేషన్ పంపిణీ

నేడు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు



వరల్డ్ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని జిల్లా పరిపాలన, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థినీ విద్యార్థుల భాగస్వామ్యంతో కలెక్టరేట్ నుంచి రాజవిహార్ వరకు భారీ ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించనున్నాం. ర్యాలీ అనంతరం కర్నూలు వైద్య కళాశాలలో సమావేశం నిర్వహించి ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు ప్రదానం చేస్తాము. దాతల సహకారంతో అధికారులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు హెచ్‌ఐవీ బాధితులతో కలిసి సహపంక్తి అల్పాహార విందు, పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నాం.

– డాక్టర్ ఎల్.భాస్కర్, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ నియంత్రణ అధికారి, కర్నూలు

రేపు రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్‌చైర్మన్ మల్లాది విష్ణు రాక

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్‌చైర్మన్ మల్లాది విష్ణు శనివారంజిల్లాకు రానున్నారని చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ టి.హిమ ప్రభాకరరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 3 గంటలకు నవరత్నాలు–సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన అనే అంశంపై జిల్లా, మండల స్థాయి అధికారులు, మునిసిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహిస్తారని, కావున, ఆయా శాఖల అధికారులు తగు నివేదికలతో హాజరు కావాలని కోరారు.

3న యాదవ కార్తీక వనభోజనం

కర్నూలు (న్యూటౌన్): డిసెంబర్ 3న రూపాల సంఘమేశ్వరస్వామి జగన్నాథగట్టుపై యాదవ కార్తీక వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యాదవ సంఘం నాయకులు డాక్టర్ బాలమద్దయ్య, సోమన్న యాదవ్ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో యాదవ కార్తీక వన భోజనం ఆహ్వాన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవ బంధువులు, సకుటుంబ సమేతంగా కార్తీక వనభోజనానికి తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు సోమన్న, నాగేశ్వర్‌రావు, వెంకట్రాముడు, శ్రీధర్, మల్లికార్జున, సిరిబాబు, కృష్ణమూర్తి, నాగేశ్వర్‌రావు, శేఖర్, విజయలక్ష్మి, సరస్వతి పాల్గొన్నారు.

3న ఆత్మహత్యల నివారణపై సదస్సు

కర్నూలు(హాస్పిటల్): ఆత్మహత్య నివారణపై డిసెంబర్ 3న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్ క్లబ్‌లో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సదస్సులో సైకాలజిస్టు డాక్టర్ సి.జ్యోతిర్మయి ప్రసంగిస్తారన్నారు.

ఆదర్శంగా సంక్షేమ పథకాల అమలు



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్

కర్నూలు కల్చరల్: సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆదర్శంగా నిలుస్తుందని కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం నగర కార్పొరేషన్ పరిధిలోని బాలాజీ నగర్ 101 సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలు బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ పాలన అందిస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాంబశివరావు, జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, జీఎస్ కరీం, మండల అధ్యక్షులు మాబాషా, నాయకులు షఫి, జమీర్, కిరణ్, జగన్, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదల సంక్షేమం

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే పేదల సంక్షేమం సాధ్యమవుతుందని మాజీ మేయర్ బంగి అనంతయ్య అన్నారు. గురువారం బుధవారాపేటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కష్టాలు తెలిసిన నాయకుడు జగన్ ప్రతి వర్గానికి లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వీటిని ప్రజలకు చేర్చేందుకు సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో పార్టీ కర్నూలు



వార్డు బ్రోచర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

క్లస్టర్–2 అధ్యక్షుడు కేదార్‌నాథ్, పార్టీ మైనారిటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఆసీఫ్, నాయకులు వెంకటేశ్వరమ్మ, నూరీడు, దినకర్, శంకర్, వంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

4న మాల మహానాడు సమావేశం

కర్నూలు(అర్బన్): స్థానిక అంబేడ్కర్ భవన్‌లో డిసెంబర్ 4న మాల మహానాడు ఐక్య కార్యాచరణ కమిటీ ఉమ్మడి కర్నూలు జిల్లా సమావేశం నిర్వహించనున్నట్లు కర్నూలు, నంద్యాల జిల్లాల కన్వీనర్ గోన నాగరాజు తెలిపారు. గురువారం బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ ఎస్సీ కులాల అభివృద్ధికి సబ్‌ప్లాన్ నిధుల కేటాయింపు, సంక్షేమ కార్యక్రమాలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే రెండు జిల్లాలకు నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. రెండు జిల్లాల మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు, విద్యావంతులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.జయరాముడు, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాసారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకండి

కర్నూలు(సెంట్రల్): ఆర్‌టీసీలో అప్రెంటిషిప్ కోసం దరఖాస్తుచేసున్న ఐటీఐ అభ్యర్థులు ఆర్టీసీ జోనల్ కాలేజీలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణమోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రూ.118 ఫీజు చెల్లించేందుకు సిద్ధంగా ఉండాలని, ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు హాజరు కావాలని సూచించారు.

హాస్టళ్ల నిర్వహణపై శ్రద్ధ పెట్టండి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు


కర్నూలు (న్యూటౌన్): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను సమర్థవంతంగా నిర్వహించి, విద్యార్థులు ఉన్నత స్థాయికి వెళ్లేలా తీర్చిదిద్దాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు సూచించారు. గురువారం సాయంత్రం ఆయన కొత్తబస్టాండు సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలుర వసతి గృహాల సముదాయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో సౌకర్యాలు, ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, విద్యార్థుల సమస్యల గురించి వాకబు చేశారు. వసతి గృహాలకు సంబంధించిన పలు రిజిష్టర్లను పరిశీలించారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. న్యాయ సేవల గురించి శాశ్విత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకటహరినాథ్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కర్నూలు సహాయ సంక్షేమ అధికారి మద్దిలేటి, వసతిగృహ సంక్షేమ అధికారులు వెంకట్‌రెడ్డి, సుంకన్న పాల్గొన్నారు.



హాస్టల్ పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

క్రీడాకారులను తీర్చిదిద్దాలి

కర్నూలు (టౌన్): ప్రభుత్వ రంగ పాఠశాలల్లో చదివే విద్యార్థులను మేటి క్రీడాకారులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పీఈటీలపై ఉందని జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ రంగారెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో వ్యాయామ ఉపాధ్యాయులకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం – ఆంధ్రా కార్యక్రమాన్ని పీఈటీలు విజయవంతం చేయాలన్నారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనేలా చైతన్యం చేయాలన్నారు. జిల్లాలో నిర్వహించనున్న ఆడుదాం –ఆంధ్రా క్రీడలకు ప్రధానోపాధ్యాయులు, పీఈటీలను రిలీవ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, కర్నూలు కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ విజయ్‌కుమార్, పాణ్యం ఇన్‌చార్జ్ పాల్ సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించాలి

కర్నూలు (టౌన్): విద్యార్థులు క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించి ఉన్నతంగా రాణించాలని క్లస్టర్ యూనివర్సిటీ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్లస్టర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుట్‌బాల్ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించిన మాట్లాడారు. క్రీడాకారులు ప్రతి రోజు క్రమం తప్పకుండా క్రీడల్లో సాధన చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



క్లస్టర్ యూనివర్సిటీ జట్టుకు ఎంపికైన ఫుట్‌బాల్ క్రీడాకారులు

బండరాళ్లను తొలగిస్తే కఠిన చర్యలు

కర్నూలు (న్యూటౌన్): అనుమతులు లేకుండా బండరాళ్లను తొలగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. గురువారం ఆయన దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామ సమీపంలోని ఆచండకొండలో అక్రమంగా బండరాళ్లను తొలగిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేశారు. బండరాళ్లను తొలగిస్తే కేసులు నమోదు చేస్తామని అక్కడి వారిని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థుల ఆందోళన

కర్నూలు (హాస్పిటల్): తమ దరఖాస్తులకు సంబంధించి చెక్‌లిస్టులు ఇవ్వకుండా అధికారులు తిప్పుకుంటున్నారని స్థానిక మెడికల్ కళాశాల వద్ద రహదారిపై అభ్యర్థులు గురువారం ఆందోళన చేపట్టారు. మెడికల్ కళాశాలలు, సర్వజన వైద్యశాల, నర్సింగ్ కళాశాలల్లో పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారు. నాలుగు రోజుల నుంచి దరఖాస్తులు సమరించిన అభ్యర్థులకు చెక్‌లిస్టులు ఇవ్వలేదు. వారు ప్రతిరోజూ కార్యాలయానికి రావడం, చెక్‌లిస్టు కోసం ఎదురుచూడటం పరిపాటిగా మారింది. కార్యాలయ సిబ్బంది చెక్‌లిస్ట్‌లు ఇవ్వకపోవడంతో తీవ్ర అసహనానికి గురైన అభ్యర్థులు కళాశాల బయట రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. ట్రాఫిక్ కొద్దిసేపు స్తంభించిపోయింది. ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని అభ్యర్థులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

4 నుంచి బహిష్కరణ

కర్నూలు (లీగల్): ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టం 2022 జీవో 512పై నిరసన వ్యక్తం చేస్తూ డిసెంబర్ విధులు బహిష్కరించాలని జిల్లా న్యాయవాదుల సంఘం గురువారం తీర్మానించింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీలు, జేఏసీ, హైకోర్టులో రిట్ పిటిషన్, ధర్నా చౌక్‌లో టెంట్ వేసి ప్రజల్లో అవగాహన తెచ్చేందుకు అందరూ కృషి చేయాలని బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.నాగభూషణం నాయుడు, ప్రధాన కార్యదర్శి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

పథకాలు పొంది సద్వినియోగం చేసుకోండి



మహిళల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొంది, ఆర్థికంగా ఎదగాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక 24వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేసీ కెనాల్, లక్ష్మీనగర్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల మంజూరు, చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకొని, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. పథకాలు అమలులో ఎలాంటి సిఫార్సు లేకుండా అర్హులకే ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఆసీఫ్, నాయకులు రాజు, సునీల్, సుచరిత, అర్చన, అబ్బాస్ అలీ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన వైద్యులకు సన్మానం

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తూ గురువారం పదవీ విరమణ చేసిన వైద్యులను మెడికల్ కాలేజీ, ప్రభుత్వ వైద్యుల సంఘం ఘనంగా సన్మానించింది. గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.వెంకటరమణ, మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జాహ్నవిలకు అధికారులు, వైద్యులు సన్మానం చేశారు. ఉద్యోగ సమయంలో వారు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి, ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, డీఐఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షులు డాక్టర్ డి.శ్రీరాములు, కార్యదర్శి డాక్టర్ విజయమోహన్‌రెడ్డి, హెచ్ఓడీలు, ప్రొఫెసర్లు, వైద్యులు పాల్గొన్నారు.



డాక్టర్ వెంకటరమణను సన్మానిస్తున్న దృశ్యం

ఆలయాల ఆస్తుల పరిరక్షణపై దృష్టి సారించాలి



సమీక్ష నిర్వహిస్తున్న ఏసీ రామాంజనేయులు

కర్నూలు కల్చరల్: జిల్లాలోని ఆలయాల ఆస్తులు, భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం.రామాంజనేయులు ఆదేశించారు. గురువారం మద్దూరు నగర్‌లోని దేవదాయ శాఖ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్లు, ఈఓలతో ఏసీ సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ 5న ఆలయాల ఆస్తులు, ఆక్రమిత భూములు, అన్యాక్రాంత ఆస్తులు, కోర్టు కేసులపై దేవదాయ శాఖ మంత్రి సమీక్ష చేస్తారన్నారు. జిల్లాలో ఉన్న కోర్టు కేసులు, అన్యాక్రాంత భూముల వివరాలను సిద్ధం చేసి నివేదిక ఇవ్వాలన్నారు. ఈఓల పరిధిలో ఎన్ని కోర్టు కేసులు ఉన్నాయి, ఏ స్థాయిలో ఉన్నాయో వివరాలు సిద్ధం చేయాలన్నారు. కర్నూలు, ఆదోని డివిజన్ల ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, ఈఓలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు కల్చరల్: కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామ పంచాయతీ టీవీ9 ప్రజా నగర్‌కు చెందిన మహబూబ్‌బాషాతో పాటు మరో 50 మంది స్థానికులు కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ సమక్షంలో ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి కుల మత, ప్రాంత, పార్టీ చూడకుండా చేస్తున్న అభివృద్ధి, కోడుమూరు ఎమ్మెల్యే నియోజవర్గానికి నాలుగేళ్లలో రూ.300 కోట్లకు పైగా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు వారు తెలిపారు. పార్టీ బలోపేతానికి కలిసి కట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.